కౌంటింగ్ ప్రక్రియలో అప్రమత్తంగా ఉండాలి

• అదనపు కలెక్టర్ శ్రీనివాస్

మాట్లాడుతున్న ఆదనపు కలెక్టర్ శ్రీనివాస్

నీలగిరి, మే 23 : వరంగల్-ఖమ్మం-నల్లగొండ శాసనమండలి ఉప ఎన్నిక కౌంటింగ్ ప్రక్రియలో కౌంటింగ్ సిబ్బంది పూర్తి అప్రమత్తంగా ఉండాలని అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ సూచించారు. కలెక్టరేట్‌లోని ఉదయాదిత్య భవన్‌లో గురువారం శాసనమండలి ఉప ఎన్నిక కౌంటింగ్ ప్రక్రియపై కౌంటింగ్ సూపర్‌వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్లకు ఓట్ల లెక్కింపు ప్రక్రియలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన నియమాలపై శిక్షణ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓట్ల లెక్కింపులో సిబ్బంది షెడ్యూల్ సమయం కంటే ముందే రావాలని, సమయానికి రిపోర్ట్ చేయాలని, సెల్ ఫోన్లను తీసుకురావద్దని చెప్పారు. ప్రాథమిక లెక్కింపులో చెల్లిన ఓట్లు చెల్లని ఓట్ల వర్గీకరణలో పరిపూర్ణంగా అవగాహన కలిగి ఉండాలన్నారు. మొదటి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపులో ఫలితం తేలకపోతే పాటించే ఎలిమినేషన్ ప్రక్రియపై సూచనలు చేశారు. కార్యక్రమంలో స్పెషల్ కలెక్టర్ నటరాజ్, శిక్షణ కార్యక్రమాల నోడల్ అధికారి, డీపీఓ శ్రవణ్, మాస్టర్ ట్రైనర్ బాలు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి

• ఎమ్మెల్యే బాలూనాయక్

మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలూనాయక్

చందంపేట(దేవరకొండ), మే 23 : విశ్రాంత ఉద్యోగులు, విద్యావంతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నదని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలూనాయక్ అన్నారు. దేవరకొండలోని విశ్రాంత ఉద్యోగుల సంఘం భవనంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి ఏడాది రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న బీజేపీ మాట నిలబెట్టుకోలేకపోయిందని అన్నారు. ఆ పార్టీ పట్టభద్రులకు చేసిందేమీ లేదని అన్నారు. నిరుద్యోగులకు అండగా కాంగ్రెస్ పార్టీ నిలుస్తుందని అన్నారు. సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి, పార్లమెంట్ కోఆర్డినేటర్ సిరాజ్‌ఖాన్, మాజీ మున్సిపల్ చైర్మన్ వడ్త్యా దేవేందర్‌నాయక్, కొర్ర రాంసింగ్ నాయక్, యూనూస్, వెంకటేశ్‌గౌడ్, సిరందాసు కృష్ణయ్య, తాడిశెట్టి నర్సింహ, చంద్రమౌళి పాల్గొన్నారు.

పాఠశాలల్లో యుద్ధ ప్రాతిపదికన వసతుల కల్పన :డీఈఓ

మిర్యాలగూడ, మే 23: అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ పర్యవేక్షణలో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో యుద్ధ ప్రాతిపదికన మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు డీఈఓ భిక్షపతి అన్నారు. స్థానిక ఎమ్మార్సీ భవనంలో ప్రధానోపాధ్యాయులకు పాఠ్య పుస్తకాల పంపిణీ చేసి, స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో ముత్తిరెడ్డికుంట కమ్యూనిటీ హాల్, శ్రీనివాసనగర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో యూనిఫామ్స్ కుట్టే విధానాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. యూనిఫామ్ నాణ్యతతో ఉండాలని సూచించారు. జిల్లాలో 1,280 పాఠశాలల్లో 87,015 విద్యార్థులకు యూనిఫామ్ కుట్టడానికి అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ పర్యవేక్షణలో స్వయం సహాయక సంఘాలకు అప్పగించామని, జూన్ 6లోపు జత యూనిఫాం కుట్టి పాఠశాలలకు అందించాలని, ఎంఈఓలు, ఐకేపీ ఏపీఎంలు తరుచుగా పర్యవేక్షించి షెడ్యూల్ ప్రకారం పాఠశాలకు అందించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఇస్లాంపురం జడ్పీ ఉన్నత పాఠశాల ఉర్దూ మీడియంలో పాఠశాలల్లో పనులను పరిశీలించి నాణ్యతా ప్రమాణాలు పాటించి జూన్ 10లోపు పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయన వెంట ఎంఈఓ బాలాజీనాయక్ తదితరులు పాల్గొన్నారు.

శిఖం భూములు ఆక్రమణకు పాల్పడితే చర్యలు : ఆర్డీఓ

కృష్ణారెడ్డి కుంటను పరిశీలిస్తున్న ఆర్డీఓ శ్రీనివాస్‌రావు

మిర్యాలగూడ, మే 23: శిఖం భూముల్లో అక్రమ కట్టడాలు చేపడితే చర్యలు తప్పవని ఆర్డీఓ శ్రీనివాస్ రావు హెచ్చరించారు. మండలంలోని కృష్ణారెడ్డి కుంటను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ కుంట 18.20 ఎకరాలు ఉండాల్సి ఉండగా 11 ఎకరాలకు పైగా సమీపంలోని రైతులు సాగు చేస్తున్నారని, కొందరు అక్రమ కట్టడాలు చేస్తున్నారని తమకు ఫిర్యాదు అందిందని తెలిపారు. కుంటను రక్షించేందుకు వెంటనే చర్యలు చేపట్టాలని ఐబీ అధికారులను సూచించారు. ఆయన వెంట తాసీల్దార్ హరిబాబు, ఆర్ఐ సత్యనారాయణ ఉన్నారు.

చెరువులో రాతి మొగరాల తొలగింపు

రాతి మొగరాలను తొలిగిస్తున్న కార్మికులు

నిడమనూరు, మే 23: మండల కేంద్రంలోని నల్లచౌట చెరువులో కబ్జాదారులు పాతిన రాతి మొగరాలను ముప్పారం మత్స్యపారిశ్రామిక సహకార సంఘం సభ్యులు గురువారం తొలగించారు. బుధవారం తాసీల్దార్ కృష్ణయ్య కు ఆక్రమణలను నియంత్రించాలని కోరుతూ వినతి పత్రం సమర్పించిన విషయం తెలిసిందే. కాగా మత్స్య కార్మికులు చెరువులో పాతిన మొగరాలను తొలగించారు. ఆక్రమణల కారణంగా చెరువు విస్తీర్ణం గణనీయంగా తగ్గుతుందని వారు తెలిపారు. కార్యక్రమంలో సంఘం చైర్మన్ కోట్ల సైదులు, మాజీ చైర్మన్ మంగినపల్లి వెంకటయ్య, మత్స్యకార్మికులు మర్రి లక్ష్మయ్య, మేకల లక్ష్మయ్య, శ్రీను, బొజ్జనబోయిన యాదయ్య, దుర్గయ్య, మేకల బ్రహ్మయ్య ఉన్నారు.

నేటి నుంచి ఇంటర్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు

రామగిరి, మే 23 : ఇంటర్మీడియేట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం నుంచి జూన్ 3 వరకు జరనున్నట్లు డీఐఈఓ దస్రూ వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా 32 పరీక్ష కేంద్రాల్లో ప్రథమ, ద్వితీయ సంవత్సరం రెగ్యులర్, ఒకేషనల్ విభాగంలో 14,655 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. వీరిలో ప్రథమ సంవత్సరంలో రెగ్యులర్ 9,371మంది, ఒకేషనల్ 999 మంది, ద్వితీయ సంవత్సరంలో రెగ్యులర్ 3,532 మంది, ఒకేషనల్ విభాగంలో 753 మంది ఉన్నారు. అన్ని పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని అధికారులు వెల్లడించారు. వేసవి దృష్టిలో ఉంచుకుని పరీక్ష కేంద్రాల వద్ద మౌలిక సౌకర్యాలతోపాటు మెడికల్ సిబ్బంది అందుబాటులో ఉంచినట్లు డీఐఈఓ తెలిపారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

డాక్యుమెంట్స్ పోయినవి
కోమటిరెడ్డి జ్యోతి W/o.వెంకటేశ్వర్‌రెడ్డి, గ్రా||మేళ్ళదుప్పలపల్లి, మం||నల్లగొండ నాకు సంబంధించిన ఒరిజినల్ రిజిస్టర్డ్ లింక్ డాక్యుమెంట్ No.4932/2014, గలది నేను నల్లగొండలోని ప్రకాశంబజార్ నుండి మేళ్ళదుప్పలపల్లికి ఆటోలో ప్రయాణిస్తుండగా పోయినవి. దొరికినవారు సంప్ర||9885738986.

WANTED
★ఒమేగా హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను, పిల్లలను చూసుకొనుటకు, ఇంటిపని, వంటపని చేయుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 20K. Ph: 8977639662 / 8977639663.
NT-327722-All

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ప్రతి 4 లైన్ల క్లాసిఫైడ్‌కు 200/-
ప్రతి అదనపు లైన్‌కు 50/-
Note: 3+1 Scheme Available
Minimum 4 Lines
Extra Line - Extra Amount
నమస్తే తెలంగాణ
నల్లగొండ : 9182777626 | నల్లగొండ : 9182777635 | దేవరకొండ : 9182777635
హాలియా : 9182777059
మిర్యాలగూడ : 9182777059

దేవరకొండలో రిటైర్డ్ ఉద్యోగుల సంఘం కార్యాలయంలో రాకేశ్‌రెడ్డిని గెలిపించాలని కోరుతున్న మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్

మిర్యాలగూడ : విశ్రాంత ఉద్యోగులతో మాట్లాడి ఓటు అభ్యర్థిస్తున్న రాష్ట్ర ఫుడ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ రాజీవ్‌సాగర్

నల్లగొండ : ఎన్‌జీ కళాశాలలో అధ్యాపకులను ఓటు అభ్యర్థిస్తున్న బీఆర్‌ఎస్‌వీ నాయకుడు బొమ్మరబోయిన నాగార్జున

రాకేశ్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలి

• పట్టభద్రుల ఎమ్మెల్సీగా రాకేశ్‌రెడ్డిని గెలిపించాలి
• విశ్రాంత ఉద్యోగుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్

చందంపేట(దేవరకొండ), మే 23 : గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి రాకేశ్‌రెడ్డిని పట్టభద్రులు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ కోరారు. దేవరకొండలోని విశ్రాంత ఉద్యోగుల సంఘం భవనంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రశ్నించే గొంతును గెలిపించుకోవాలని అన్నారు. సాధ్యం కాని హామీలతో కాంగ్రెస్ ప్రజలను మోసం చేస్తుందని, ఈ విషయాన్ని పట్టభద్రులు గుర్తించి విద్యావంతుడైన రాకేష్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు నర్సింహ, కార్యదర్శి చంద్రమౌళి, బీఆర్‌ఎస్‌వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేముల రాజు, నియోజవర్గ అధ్యక్షుడు బొడ్డుపల్లి కృష్ణ, తులసిరాం, లింగయ్య, బుచ్చయ్య పాల్గొన్నారు.

నిరుద్యోగ, ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి

మిర్యాలగూడ : ఈనెల 27న జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని రాష్ట్ర ఫుడ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మేడి రాజీవ్‌సాగర్ కోరారు. మిర్యాలగూడ పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల సంఘం భవనంలో విశ్రాంత ఉద్యోగులతో బీఆర్‌ఎస్ నియోజకవర్గ యువ నేత నల్లమోతు సిద్ధార్థతో కలిసి సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో రాకేశ్‌రెడ్డిని గెలిపిస్తే నిరుద్యోగ, ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తారని అన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు అన్నభీమోజు నాగార్జునచారి, బీఆర్‌ఎస్ నాయకులు పశ్యా శ్రీనివాస్‌రెడ్డి, గుడిసె దుర్గాప్రసాద్, రఘుమారెడ్డి, వల్లపు రామస్వామి, వీరానాయక్, ఎండీ.షోయబ్, ఘంటా శ్రవణ్‌రెడ్డి, పందిరి వేణు, గుండెబోయిన చందు యాదవ్, మౌజం అలీ, హబీబ్, దయాకర్‌రెడ్డి, అలుగుబెల్లి వెంకట్, తిరందాసు విష్ణు, ఫయాజ్ పాల్గొన్నారు.

మిర్యాలగూడలో ఇంటింటి ప్రచారం చేసిన బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు అన్నభీమోజు నాగార్జునచారి

రాకేశ్‌రెడ్డికి మద్దతుగా ప్రచారం

నీలగిరి : రాకేశ్‌రెడ్డికి మద్దతుగా బీఆర్‌ఎస్‌వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొమ్మరబోయిన నాగార్జున జిల్లా కేంద్రంలోని నాగార్జున ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అధ్యాపకులను కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో రాకేశ్ రెడ్డి సీరియల్ నంబర్ -3లో మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు నోముల క్రాంతి యాదవ్, అంబటి ప్రణిత్, అఖిల్ రెడ్డి, గణేశ్, ఉమామహేశ్వర్, ఆంజనేయులు, లింగస్వామి, వెంకన్న అధ్యాపకులు పాల్గొన్నారు.

మిర్యాలగూడటౌన్ : బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు అన్నభీమోజు నాగార్జునచారి అన్నారు. గురువారం ఆయన పట్టణంలోని పలు వార్డుల్లో గ్రాడ్యుయేట్లను ఓట్లు అభ్యర్థించారు. ఆయన వెంట పట్టాభి, అరుణ్, రామ్‌ప్రసాద్ పాల్గొన్నారు.

శాలిగౌరారం : పట్టభద్రుల బీఆర్‌ఎస్‌ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరుతూ గురువారం బీఆర్‌ఎస్ నాయకులు గ్రాడ్యుయేట్లను ఓటు అభ్యర్థించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు ఐతగోని వెంకన్నగౌడ్ మండల ప్రధాన కార్యదర్శి చాడ హతీశ్‌రెడ్డి, మామిడి సర్వయ్య, కట్ట వెంకట్‌రెడ్డి, గుజిలాల్ శేఖర్‌బాబు పాల్గొన్నారు.

శాలిగౌరారం : ఓటు అభ్యర్థిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

చెరువులను కబళిస్తున్న కాంగ్రెస్ నేతలు

■ రైతుబంధు సమితి జిల్లా మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి

మాట్లాడుతున్న చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి

మిర్యాలగూడ, మే 23 : మిషన్ కాకతీయ పథకం ద్వారా బీఆర్‌ఎస్ ప్రభుత్వం చెరువులను పునరుద్ధరించిందని, అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం చెరువులో మట్టిని ఇష్టారాజ్యంగా కబళిస్తున్నారని రైతుబంధు సమితి జిల్లా మాజీ అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి విమర్శించారు. మిర్యాలగూడలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గ పరిధిలోని యాద్గార్‌పల్లి పందిళ్లపల్లి చెరువు, రుద్రారం చెరువు, వెంకటాద్రిపాలెం చెరువుల్లో వేలాది ట్రాక్టర్లు, టిప్పర్ల ద్వారా అనుమతులు లేకుండా ఇష్టారాజ్యంగా తరలిస్తున్నారని అన్నారు. నియోజకవర్గానికి చెందిన ఒక ప్రధాన నాయకుడు కనుసన్నల్లో ఈ దందా యథేచ్ఛగా కొనసాగుతున్నదన్నారు. మైనింగ్ డిపార్ట్‌మెంట్ నుంచి కొద్దిగా అనుమతి తీసుకొని ఇష్టానుసరంగా తవ్వకాలు జరుపుతూ కొందరు కాంగ్రెస్ నాయకులు అక్రమ ఆర్జనకు తెరలేపారని ఆరోపించారు. రైతుల నోట్లో మట్టి కొట్టి కమర్షియల్ అవసరాలకు చెరువు ఒండ్రు మట్టిని తరలించడమేంటని ప్రశ్నించారు. చెరువుల్లో అడ్డగోలుగా తవ్వకాలు జరపడం వల్ల మున్ముందు చెరువులు నిండిన తరువాత ప్రమాదాలు జరిగే పరిస్థితి ఉందన్నారు. ఇటువంటి గుంతలు తవ్వడం వల్ల దామరచర్లలోని ఒక చెరువులో ఇద్దరు చిన్నారులు చనిపోయారని తెలిపారు. ఇప్పటికైనా ప్రధాన నాయకుడు ఈ అక్రమ దందాకు చెక్ పెట్టకపోతే బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో రైతులతో కలిసి అడ్డుకుంటామని హెచ్చరించారు. చెరువుల్లో మట్టి తవ్వకాలు అక్రమ దందా పై కలెక్టర్, ఎస్పీకి ఫిర్యాదు చేసినట్లు వివరించారు. అలాగే నియోజకవర్గంలో ఇసుక మాఫియా కొనసాగుస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నా రెవెన్యూ, పోలీసు అధికారులు పట్టించుకోకపోవడం లేదని ఆరోపించారు ప్రభుత్వ ఉన్నతాధికారులు ఈ అక్రమ దందాపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

దామరచర్లలో ముత్యాలమ్మ జాతర

• మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు పూజలు

మాను ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

దామరచర్ల, మే 23 : మండల కేంద్రంలో ముత్యాలమ్మ జాతర గురువారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేకంగా అలంకరించిన మాను అన్ని వీధుల గుండా ఊరేగించారు. మహిళలు భక్తి శ్రద్ధలతో బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. మూడ్రోజుల పాటు జరుగనున్న జాతరతో గ్రామం అంతా సందడిగా మారింది. మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. మాను ఊరేగింపులో పాల్గొన్నారు. కార్యక్రమంలో వీరకోటిరెడ్డి, బాల సత్యనారాయణ, ఆంగోతు హాతీరాం, వీరసైదులు, వీరబాబు, శ్రీనివాస్‌రెడ్డి, రఫీ పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం

త్రిపురారంలో స్వామి వారి ఊరేగింపు

త్రిపురారం, మే 23 : మండలంలోని బొర్రాయిపాలెం గ్రామంలో కొలువై ఉన్న శ్రీభూదేవి, శ్రీదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణం గురువారం వైభవంగా జరిగింది. కల్యాణం అనంతరం భక్తులకు మహా అన్నదానం నిర్వహించారు. ఉదయం నుంచే బొర్రాయిపాలెం గ్రామం నుంచే కాకుండా చెన్నాయిపాలెం, రాజేందర్‌నగర్, అన్నారంతోపాటు మండలంలోని పలు గ్రామాల నుంచి భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ చైర్మన్ బిట్టు వసంతారవికుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కర్నాటి లింగారెడ్డి దంపతులు పాల్గొన్నారు.

హాలియాలో..

హాలియా : హాలియా సాయి ప్రతాప్‌నగర్‌లోని వేంకటేశ్వర స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం స్వామి వారి తిరు కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. కల్యాణం తిలకించేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అన్నదాన కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్పర్సన్ యడవల్లి అనుపమా నరేందర్‌రెడ్డి ప్రారంభించారు. సాయంత్రం హాలియా పుర వీధుల్లో స్వామి వారిని ఊరేగించారు కార్యక్రమంలో ఆలయ అర్చకులు గోవర్ధన రాఘవాచార్యులు, భక్తులు నామని సుధాకర్, తిరుపతి నాయుడు మంచుకొండ శ్రీనివాస్, ప్రేమ్ కుమార్, అరుణ, చంద్రకళ, భాగ్య, రాజ్యలక్ష్మి, పాల్గొన్నారు.

26న వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణోత్సవం

నార్కట్‌పల్లి, మే 23: మండలకేంద్రంలోని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో ఈ నెల 26న తలపెట్టిన కల్యాణ మహోత్సవ వాల్ పోస్టర్‌ను గురువారం ఎంపీడీఓ ఉమేశ్‌చంద్ర ఆవిష్కరించారు. కార్యక్రమంలో దేవాలయ వ్యవస్థాపక అధ్యక్షుడు పెండోట సోము, చైర్మన్ చొల్లేటి బ్రహ్మచారి, అద్దంకి క్రిష్ణమాచారి, గడగోజు సత్యనారాయణ, గుంటోజు రమేశ్, శ్రీనివాసాచారి, అర్చకులు ఉత్తరపల్లి అనంతాచారి, పెండోట భిక్షమాచారి, పిన్నోజు రామాచారి పాల్గొన్నారు.

కార్యకర్తల కుటుంబాలను ఆదుకుంటాం

• మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు

మిర్యాలగూడ : కార్యకర్త కుటుంబానికి బీమా చెక్కు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు, మేడే రాజీవ్ సాగర్

మిర్యాలగూడ, మే 23 : మృతిచెందిన కార్యకర్తలను అన్ని పార్టీ అన్ని విధాలుగా ఆదుకుంటుందని మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు అన్నారు. మండలంలోని జాలుబాయితండా గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త జర్పుల లింగు విద్యుదాఘాతంతో ఇటీవల మృతిచెందగా ఆయనకు బీఆర్‌ఎస్ సభ్యత్వం కలిగి ఉండడంతో పార్టీ నుంచి మంజూరైన రూ.2 లక్షల ప్రమాద బీమా చెక్కును పట్టణంలోని రెడ్డి కాలనీ పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయ సింహారెడ్డి, రాష్ట్ర ఫుడ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మేడే రాజీవ్‌సాగర్, రైతు బంధు సమితి జిల్లా మాజీ అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి లింగు కుటుంబసభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ చిట్టిబాబునాయక్, సీనియర్ నాయకులు అన్నభీమోజు నాగార్జునచారి, పీఏసీఎస్ చైర్మన్ వెలిశెట్టి రామకృష్ణ, జర్పుల సేవానాయక్, నాగేందర్‌నాయక్, శ్రీను నాయక్, శారద, సైదానాయక్, రామస్వామి, చందుయాదవ్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు పరామర్శ

మిర్యాలగూడ పట్టణంలోని చైతన్యనగర్‌కు చెందిన పచ్చ వెంకటరత్నం గురువారం అనారోగ్యంతో మృతిచెందాడు. మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు, జయ దంపతులు వెంకటరత్నం మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు.అలాగే మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహారెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ధనావత్ చిట్టిబాబునాయక్, నల్లమోతు సిద్ధార్థ సంతాపం తెలిపారు.

కార్యకర్త కుటుంబాలకు అండగా బీఆర్‌ఎస్

వేములపల్లి : మొల్కపట్నంలో బీమా చెక్కు అందిస్తున్న బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి

వేములపల్లి : మండలంలోని మొల్కపట్నం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త భారీ జగన్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. జగన్‌కు బీఆర్‌ఎస్ పార్టీ సభ్యత్వం ఉండడం వల్ల బీఆర్‌ఎస్ నుంచి రూ.2 లక్షల ప్రమాద బీమా చెక్కు మంజూరైంది. సంబంధిత చెక్కును పార్టీ మండలాధ్యక్షుడు నామిరెడ్డి కరుణాకర్‌రెడ్డి గురువారం జగన్ సతీమణి నాగమణికి చెక్కును అందజేసి మాట్లాడారు. ఆపదలో ఉన్న కార్యకర్తల కుటుంబాలను బీఆర్‌ఎస్ పార్టీ అన్ని విధాలుగా ఆదుకుంటుందన్నారు.

2న కొండమల్లేపల్లిలో బొడ్రాయి వార్షికోత్సవం

సమావేశంలో పాల్గొన్న ఉత్సవ కమిటీ సభ్యులు

కొండమల్లేపల్లి, మే 23 : బొడ్రాయి ప్రథమ వార్షికోత్సవం జూన్ 2న నిర్వహించాలని కొండమల్లేపల్లి బొడ్రా యి కమిటీ నిర్ణయించింది. మండల కేంద్రంలోని చౌరస్తా గల సీతారామచంద్రమౌళీశ్వర ఆలయంలో గురువారం ఉ త్సవ కమిటీ సభ్యులు సమావేశం నిర్వహించుకున్నారు. ఉత్సవాల్లో భాగంగా 2న 10 గంటలకు గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు, బోనాలు సమర్పించుకోవాలని నిర్ణయించారు. కార్యక్రమంలో కేసాని లింగారెడ్డి, మారం రవీందర్‌రెడ్డి, పస్నూరి యుగేందర్‌రెడ్డి, శ్రీనివాసులు, ఉట్కూరి వేమన్‌రెడ్డి, తొటపల్లి కిరణ్, దాచేపల్లి నరేందర్, నీలా లక్ష్మయ్య, అందుగుల ముత్యాలు, వరికుప్పల పాండు, బూడిద వెంకటయ్య, కృష్ణారెడ్డి, పూజారి పాల గణపతిశర్మ పాల్గొన్నారు.

ఆటోను ఢీ కొట్టిన డీసీఎం.. ఆటో డ్రైవర్ మృతి

చిట్యాల, మే 23 : మండలంలో వెలిమినేడు వద్ద గురువారం ఆటోను డీసీఎం వెనుక నుంచి ఢీ కొనడంతో ఆటో డ్రైవర్ మృతి చెందాడు. ఎస్ఐ లింగయ్య తెలిపిన వివరాల ప్రకారం చిట్యాలకు చెందిన ఆవుల శ్రీశైలం వృత్తి రీత్యా ఆటో డ్రైవర్ . గురువారం మధ్యాహ్నం ప్రయాణికులతో చౌటుప్పల్‌కు వెళ్తుండగా వెలిమినేడు వద్దకు చేరుకోగానే వెనుక నుంచి అజాగ్రత్తగా అతివేగంగా వచ్చిన డీసీఎం ఆటోను ఢీ కొట్టడంతో శ్రీశైలానికి గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం హైదరాబాద్ తరలించగా వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. కాగా ఆటోలో ప్రయాణిస్తున్న ముజ్జు అనే వ్యక్తికి గాయా లయ్యాయి. చికిత్స నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. శ్రీశైలం భార్య జయంతి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లింగయ్య వివరించారు.

మరుగుదొడ్ల నిర్మాణానికి భూమి పూజ

నందికొండ, మే 23 : నాట్కో ట్రస్ట్ సహకారంతో హిల్‌కాలనీలోని బీసీ గురుకుల పాఠశాలలో రూ.60 లక్షలతో నిర్మించనున్న మరుగుదొడ్ల నిర్మాణం పనులను ట్రస్ట్ ప్రతినిధి జీ ఎల్ రావు, నాట్కో ఫార్మా కంపెనీ సివిల్ ఇంజినీర్ సునీల్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీసీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ రజినీకాంత్ అభ్యర్థన మేరకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు.కార్యక్రమంలో నవీన్, నరేందర్‌రెడ్డి, బీసీ గురుకుల పాఠశాల, నాట్కో ఫార్మా కంపెనీ సిబ్బంది పాల్గొన్నారు.

పలువురికి మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్ నివాళి

చందంపేట(నేరేడుగొమ్ము):నేరేడుగొమ్ము మండలం తిమ్మాపురం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త కుంభం నిరంజన్, పీఏ పల్లి మండలం దుగ్యాల గ్రామానికి చెందిన బుర్రి ఎల్లేశ్ గురువారం మృతి చెందారు. మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ వారి మృతదేహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట ముక్కమల బాలయ్య, ఆరెకంటి రాములు, పల్స వెంకటయ్య, కేశవులు, కుంభం నరేష్, వడ్త్య, బాలు, రమావత్ తులసీరాం, కుంభం వెంకటయ్య, వెంకటేశ్, బీమా ఉన్నారు. పీఏ పల్లి మండలంలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు వల్లపురెడ్డి, నాయకులు రంగారెడ్డి, వంగాల కృష్ణారెడ్డి, ప్రదీప్, సుధాకర్, బొడ్డుపల్లి మహేందర్, శ్రీనివాస్, రమావత్ తులసిరాం ఉన్నారు.

నేడు నేరేడుగొమ్ము ఎంపీపీ ఎన్నిక

చందంపేట(నేరేడుగొమ్ము), మే 23: నేరేడుగొమ్ము ఎంపీపీని శుక్రవారం ఎన్నుకోనున్నట్లు దేవరకొండ ఆర్డీఓ శ్రీరాములు తెలిపారు. గతంలో ఇక్కడ ఎంపీపీగా, వైస్ ఎంపీపీగా పని చేసిన వారిపై అవిశ్వాస నెగ్గడంతో ఆ పదవులు ఖాళీ అయ్యాయని తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నేరేడుగొమ్ము ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీని ఎన్నుకోనున్నట్లు తెలిపారు.

గొర్రెల పథకం డీడీ వాపస్‌కు దరఖాస్తు చేసుకోండి

• పశువైద్యాధికారి వినయ్‌కుమార్

మాడ్గులపల్లి, మే 23: రెండో విడత గొర్రెల యూనిట్ల కోసం కట్టిన నగదు తిరిగి చెల్లించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు మండల పశువైద్యాధికారి వినయ్ కుమార్ గురువారం తెలిపారు. రెండో విడత గొర్రెల పంపిణీకి లబ్ధిదారులు రూ.43,750 డీడీలు చెల్లించారని, డబ్బులు కట్టినా గొర్రెలు రాని వారి నుంచి డీడీల విత్ డ్రా కోసం తాము లబ్ధిదారుల నుంచి దరఖాస్తులను తీసుకొని కలెక్టర్ కార్యాలయానికి పంపిస్తామని అన్నారు. లబ్ధిదారులకు రెండు వారాల్లోపు వారి బ్యాంకు ఖాతాల్లో నగదు పడుతుందన్నారు. ఇందుకోసం దరఖాస్తు ఫారం నింపి దానికి ఆధార్‌కార్డు, బ్యాంక్ పాస్ పుస్తకం జత చేసి తమకు అందించాలన్నారు.

ఎన్‌ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌నకు బకల్‌వాడి విద్యార్థులు

మిర్యాలగూడ, మే 23: పట్టణంలోని బకల్‌వాడి ఉన్నత పాఠశాల విద్యార్థులు నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్‌లకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు కరుణాకర్‌రెడ్డి గురువారం తెలిపారు. చదువుల్లో ఉత్తమ ప్రతిభ చాటిన సీహెచ్.భవగ్ని, కె.మేఘన, ఎస్‌కె.కాసిఫ్ ఎంపికైనట్లు తెలిపారు. స్కాలర్‌షిప్‌కు ఎంపికైన విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు. ఉపాధ్యాయులు డి.వెంకటేశ్వర్లు, కట్ల మధుసూదన్, కర్నాటి శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

కొండమల్లేపల్లి, మే 23 : మండలంలోని కొల్‌ముంతల్‌పహాడ్ గ్రామానికి చెందిన ఆకారపు కృష్ణయ్య (47) బుధవారం రాత్రి తన గ్రామానికి స్కూటీపై వెళ్తున్న క్రమంలో తాసీల్దార్ కార్యాలయం ఎదుట బైకులు ఢీ కొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. దాంతో హైదరాబాద్‌కు తరలించగా చికిత్స పొందుతు గురువారం సాయంత్రం మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. మృతుడి భార్య బొజ్జమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాంమ్మూర్తి తెలిపారు.